సాక్షి
కామారెడ్డి
గురువారం । 27 । మార్చి । 2025



ఇందిరమ్మ ఇళ్లకు..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మార్కవుట్ ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:35	శుక్ర: 4:51

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.2 /19.3

ఈదురుగాలులు వీస్తాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బొందలగడ్డ భూముల సర్వే



స్థలాన్ని సర్వే చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని తెల్గాపూర్ శివారులో ఉన్న బొందల గడ్డ భూములను బుధవారం రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సర్వే చేశారు. 'బొందల గడ్డకు రైతు బంధు' శీర్షికన ఈనెల 23 న 'సాక్షి'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించి, భూములను పరిశీలించారు. సర్వే అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్‌నగర్ మండల ఆర్‌ఐ పండరి, సర్వేయర్ శ్రీకాంత్, అటవీశాఖ బీట్ అధికారి శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీఎడ్ కళాశాలల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలో ప్రైవేట్ డీఎడ్ కళాశాల స్థాపన కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిజామాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కళాశాలల స్థాపన, ప్రస్తుతం ఉన్న కళాశాలల అనుమతుల పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం 63039 63931 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కామారెడ్డి తైబజార్ @ రూ. 26 లక్షలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా కార్యాలయంలో బుధవారం తైబజార్, మేకలు, గొర్రెల సంతకు బహిరంగ వేలం నిర్వహించారు. తైబజార్‌ను అజ్మత్ అలీ అనే వ్యక్తి రూ. 26 లక్షలకు, మేకలు, గొర్రెల సంతను అబ్దుల్ రహుఫ్ రూ. 4 లక్షలకు దక్కించుకున్నారు. వచ్చే ఏడాది 31వ తేదీ వరకు టెండర్ కాలపరిమితి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

'హిందీ జాతీయ సమైక్యతను పెంపొందిస్తుంది'



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: బహుభాషల దేశంలో హిందీ జాతీయ సమైక్యతను పెంపొందిస్తుందని భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ అసోసియేట్ లెక్చరర్ పవన్ పాండే పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో 'హిందీ భాష -ఉపాధి అవకాశాలు' అన్న అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో పవన్ పాండే మాట్లాడుతూ వైరుధ్యం లేకుండా హిందీ నేర్చుకున్నవారు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. హిందీతో అనేక ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. హిందీలో ఉన్నత విద్యనభ్యసించడం ఉపాధి అవకాశాలు లభించడానికి సులువైన మార్గం అని కళాశాల హిందీ విభాగం అధిపతి జి.శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. విద్యార్థులు హిందీలో కవితలు వినిపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, సమన్వయకర్తలు విశ్వప్రసాద్, జయప్రకాష్, సుధాకర్, అధ్యాపకులు రాములు, ఫర్హీన్ ఫాతిమా, బాలాజీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేను.. మీ కలెక్టర్‌ను...

"హలో.. నేను మీ కలెక్టర్‌ను.. మీ పేరు, మీ ఊరు, మీ సమస్య చెప్పండి" అంటూ 'సాక్షి' ఫోన్ ఇన్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను ఓపికగా వింటూ, నోట్ చేసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం /కామారెడ్డి టౌన్

- సమస్య చెప్పండి.. పరిష్కరిస్తాం
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- సమస్యలను నోట్ చేసుకుని, అధికారులతో సమీక్ష
- అన్నింటినీ పరిష్కరించాలని ఆదేశం



సాక్షి ఫోన్ ఇన్

జిల్లాలో తాగునీటి సమస్యలపై బుధవారం 'సాక్షి' కలెక్టర్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో మురళి, మిషన్ భగీరథ(ఇంట్రా) ఈఈ రమేశ్, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా అధికారులు, పంచాయతీ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి కాల్స్ వచ్చాయి. గంట సమయం నిర్దేశించుకోగా కాల్స్ వస్తుండడంతో సుమారు గంటన్నరపాటు కార్యక్రమంలో ఉన్నారు. తర్వాత వచ్చిన కాల్స్‌ను కంట్రోల్ రూం అధికారులు రిసీవ్ చేసుకున్నారు. కలెక్టర్ స్వయంగా 45 మంది కాలర్స్‌తో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాల్ చేసిన వారి పేరు, ఊరు, ఏ రకమైన సమస్య ఉందో అడిగారు. ఫోన్ ఇన్ కార్యక్రమం ముగిసిన తరువాత కలెక్టర్ సంగ్వాన్ అధికారులతో సమీక్షించారు. వచ్చిన అన్ని కాల్స్‌కు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కాగా సాయంత్రం వరకే 12 సమస్యలను పరిష్కరించినట్లు మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులు 'సాక్షి'తో తెలిపారు. మిగతా సమస్యలనూ పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

మిషన్ భగీరథ ద్వారా పైప్‌లైన్ వేసినా నీరు రావడం లేదు. పబ్లిక్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించండి. – అజయ్‌కుమార్, మద్నూర్

కలెక్టర్: మీ సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తా.

గ్రామంలోని ప్రధానమైన రెండు బోర్లు చెడిపోయాయి. వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నాం.

– రమేశ్, లింగంపల్లి, సదాశివనగర్ మండలం

కలెక్టర్: అధికారులు వచ్చి సమస్యలను తెలుసుకుంటారు. బోర్లకు మరమ్మతులు చేయిస్తాం.

మంచినీటి పథకం ట్యాంకును శుభ్రం చేయడం లేదు.

– బలరాం, నాగిరెడ్డిపేట

కలెక్టర్: గ్రామ కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతాం.

మా కాలనీలోని వెంకటేశ్వరాలయం ప్రాంతంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది.

– పురుషోత్తం, కోటగల్లి, బాన్సువాడ

కలెక్టర్: వార్డు అధికారులు వచ్చి పరిశీలించి సమస్య పరిష్కరిస్తారు.

జిల్లా కేంద్రంలోని గోదాదేవి ఆలయం పక్కన బోరు వేసి వదిలేశారు.

– రమేశ్, అశోక్‌నగర్, కామారెడ్డి

కలెక్టర్: బోరును వాడకంలోకి తీసుకువస్తాం.

కొత్త బీసీ కాలనీలో నీటి సమస్య ఉంది.

– యాదయ్య, రాజంపేట్

గ్రామానికి చెందిన ఓ మాజీ కోఆప్షన్ సభ్యుడు ప్రభుత్వ బోరును కబ్జా చేసి, అతడి ఇంటి అవసరాలకు వాడుకుంటున్నాడు. దీంతో గ్రామస్తులకు నీళ్లు దొరకడం లేదు.

– మేనూర్‌వాసి, మద్నూర్ మండలం

కలెక్టర్ : ఇలాంటి వాటిని ఉపేక్షించకూడదు. ఆర్డీవో, తహసీల్దార్‌లతో మాట్లాడి వెంటనే విచారణ జరిపిస్తాం. నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

వారానికోసారి గోదావరి జలాలు వస్తున్నాయి. చెడిపోయిన మోటార్లకు మరమ్మతులు చేయించడం లేదు. సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు.

– తిరుపతి రెడ్డి, రామ్మోహన్, అశోక్‌నగర్ కాలనీ, శ్రీకాంత్, విద్యానగర్, కామారెడ్డి

కలెక్టర్ : మున్సిపల్ అధికారులతో మాట్లాడి మీ సమస్యను పరిష్కరిస్తాం. క్రమం తప్పకుండా నీరు వచ్చేలా చూస్తాం. ట్యాంకర్లు ఏర్పాటు చేయిస్తాం.

కలెక్టర్: పంచాయతీ అధికారులకు సూచనలు జారీ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

పీహెచ్‌సీ సమీపంలోని కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉంది.

– జహీరున్నీసా బేగం, లింగంపేట

కలెక్టర్: తక్షణమే అధికారులను పంపించి వివరాలు తెలుసుకుంటాం. వాటర్ ట్యాంకర్లను పంపిస్తాం.

జిల్లా కేంద్రంలోని నాలుగో వార్డుకు చెందిన ఓ మాజీ కౌన్సిలర్ మున్సిపల్ బోరు నుంచి తన ఇంటికి కనెక్షన్ తీసుకుని నీటిని మొత్తం ఆయనే వాడుకుంటున్నాడు. కాలనీలో మిగతా వారికి నీటి ఇబ్బందులు తప్పడం లేదు.

– నాలుగో వార్డువాసి, కామారెడ్డి

కలెక్టర్ : మున్సిపల్ అధికారుల ద్వారా విచారణ జరిపిస్తాం. ఆ బోరు నుంచి కాలనీలో అందరికీ నీరు అందేలా చూస్తాం.

గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పరిష్కరించండి..

– నరేశ్, రాంలక్ష్మణ్ పల్లి, గాంధారి మండలం

కలెక్టర్: పంచాయతీ అధికారులతో సర్వే చేయించి నీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

ఎగువ ప్రాంతంలో కొందరు మిషన్ భగీరథ కుళాయిలకు నేరుగా మోటార్లు బిగించి నీటిని లాగేస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతంలో ఉన్న కాలనీలకు నీళ్లు రావడం లేదు.

– పండరి, గోర్గల్, నిజాంసాగర్ మండలం

కలెక్టర్ : అలా చేయడం సరికాదు. అధికారులు వచ్చి అక్కడి పరిస్థితులు తెలుసుకుంటారు. కుళాయికి నేరుగా మోటార్లు బిగిస్తే చర్యలు తీసుకుంటారు. అందరికీ నీళ్లు వచ్చేలా చూస్తాం.

గ్రామానికి చెందిన 1, 2, 3, 8 వార్డుల పరిధిలోగల బోరుబావులు పని చేయడం లేదు. నీటి సమస్య తీవ్రంగా ఉంది. ట్యాంకర్లు పంపించండి.

– హారిక, లక్ష్మీరావులపల్లి, మాచారెడ్డి మండలం

కలెక్టర్ : అధికారులను పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ట్యాంకర్లు పంపుతాం.

గ్రామంలో ప్రభుత్వ బోర్లు చెడిపోతున్నాయి. తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం.

– సురేందర్, సోమారంపేట్, మాచారెడ్డి మండలం

కలెక్టర్ : నీరున్న బోరు బావులకు సంబంధించిన బోరు మోటార్లు బాగు చేయించి నీరందేలా చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కొత్త బోర్లు వేయిస్తాం.

జిల్లా కేంద్రంలోని భవానీ నగర్‌లో నాలుగేళ్ల క్రితమే మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు వేసి, ఇంటింటికీ నల్లా కనెక్షన్‌లు ఇచ్చారు. ఇప్పటికీ చుక్క నీరు రాలేదు.

– ప్రవీణ్, సురేష్, నాగరాజు, భవానీనగర్, కామారెడ్డి

కలెక్టర్ : అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

హన్మాజీపేట జీపీ పరిధిలోని కాంతాపూర్, షెట్‌పల్లి తండా, హన్మాజీపేట్ తండాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం.

– సాయాగౌడ్, హన్మాజీపేట్, బాన్సువాడ మండలం

కలెక్టర్ : సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

మిషన్ భగీరథ నీళ్లు మా గ్రామానికి ఇప్పటి వరకు రాలేదు. నీటిని ఎప్పుడు అందిస్తారు. – రమేశ్, కాటేపల్లి తండా, పెద్దకొడప్‌గల్ మండలం

కలెక్టర్ : ఎందుకు నీళ్లు రాలేదో విచారణ జరిపిస్తాం. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

గ్రామంలో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. పాత బోర్లు పని చేయడం లేదు. కొత్త బోర్లు వేయించాలి.

– రజిత, సోమార్‌పేట్, మాచారెడ్డి మండలం

కలెక్టర్ : ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయిస్తాం. అవసరమైతే కొత్త బోర్లు వేయిస్తాం.

భవానీపేట్ తండాలో ఒకటే బోరు ఉంది. మూడు రోజులకు ఒకసారి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి. సమస్యను పరిష్కరించాలి.

– రాము, భవానీపేట్ తండా, పాల్వంచ మండలం

కలెక్టర్ : కొత్త బోరు వేయించడానికి ప్రయత్నిస్తాం. నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.



ఫోన్‌ఇన్ అనంతరం అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

'సమన్వితా' కార్యకలాపాలు నిలిపివేయాలి

- లింగ నిర్ధారణ కేసులో ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు
- గాంధారి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడిపై బదిలీ వేటు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలోగల సమన్విత ప్రైవేట్ ఆస్పత్రిలో కార్యకలాపాలు నిలిపివేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2022లో శ్రీరాంనగర్ కాలనీలోని ఓ అద్దె భవనంలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన కేసులో రాష్ట్ర, జిల్లా వైద్య శాఖ అధికారులు డెకాయ్ ఆపరేషన్ చేపట్టి సాక్ష్యాలతో కౌసల్య ఆస్పత్రిని సీజ్ చేశారు. ఇదే యజమాన్యం పేరు మార్చి అదే కాలనీలో సొంత భవనంలో సమన్విత పేరిట ఆస్పత్రిని ప్రారంభించింది. 2024లో లింగ నిర్ధారణ, శిశు విక్రయం వ్యవహారంలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్ కింద పలు కేసులు నమోదు అయ్యాయి. అదే ఏడాదిలో స్కానింగ్ యంత్రాలు తరలిస్తుండగా పట్టుకుని మొబైల్ స్కానింగ్ చేస్తున్నారని యంత్రాలను, ఆస్పత్రిని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఆస్పత్రి యాజమాన్యంలో ఒకరైన గాంధారి సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌ను డీఎంహెచ్‌వో ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి యాజమాన్యం వైద్య ఆరోగ్యశాఖ తీరును సవాల్ చేస్తూ ఆరు నెలల క్రితం హైకోర్టును ఆశ్రయించి రిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపైన హైకోర్టు విచారణ చేపట్టగా.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సాక్ష్యాధారాలను, షోకాజ్ నోటీస్ డాక్యుమెంట్లను హైకోర్టుకు సమర్పించింది. ఇరు వర్గాల వాదనలు విన్న హైకోర్టు.. బుధవారం తీర్పునిచ్చింది. సమన్విత ఆస్పత్రిలో ఎలాంటి కార్యకలాపాలు కొనసాగించవద్దని, ఈ ఆస్పత్రిలో ఎలాంటి వైద్య సేవలు, చికిత్సలు నిర్వహించడానికి వీలులేదని ఆదేశాలు జారీ చేసింది.



కోర్టు ఆర్డర్ ప్రతులను ఆస్పత్రి గోడకు అతికించిన వైద్య శాఖ సిబ్బంది

మెడికల్ ఆఫీసర్ బదిలీ

సమన్విత ఆస్పత్రి యాజమాన్యంలో ఒకరైన గాంధారి ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌ను గతంలోనే ప్రభుత్వానికి సరెండర్ చేశారు. క్రమశిక్షణ చర్యలలో భాగంగా అతడిని కుమురం భీం ఆసిఫాబాద్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్టు ప్రతులను తీసుకోవడానికి నిరాకరణ

హైకోర్టు ఆర్డర్స్ ప్రతులను ఇవ్వడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది బుధవారం సాయంత్రం ఆస్పత్రికి వెళ్లారు. అయితే ఆర్డర్స్‌ను తీసుకోవడానికి ఆస్పత్రి యాజమాన్యం తిరస్కరించిందని వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఆస్పత్రి గోడకు కోర్టు ఆర్డర్స్ ప్రతులను అతికించామన్నారు. కోర్టు తీర్పు మేరకు ఆ ఆస్పత్రికి ఎవరూ వైద్యంకోసం రావద్దని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ సూచించారు.

'సేవలతోనే సమాజంలో గుర్తింపు'



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్

భిక్కనూరు: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవల్లో పాల్గొంటేనే సమాజంలో గుర్తింపు వస్తుందని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం సౌత్‌క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెడ్ రిబ్బన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. అనంతరం హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌లపై విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ ఎన్‌ఎస్‌ఎస్ అధికారి బందెల అంజయ్య, అధ్యాపకులు మోహన్‌బాబు, ప్రతిజ్ఞ, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతుకు చేయూత

- రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించనున్న సర్కారు
- దరఖాస్తుకు 29 వరకు అవకాశం

బిచ్కుంద: రైతులను ఆధునిక వ్యవసాయ పద్ధతులవైపు మళ్లించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మహిళా రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించాలని నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం రాయితీ, జనరల్ రైతులకు 40 శాతం రాయితీ అందించనుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ పరికరాలను అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తు చేసుకోవడానికి గురువారం నుంచి శనివారం వరకు అవకాశం ఇచ్చింది. ఆన్‌లైన్‌లోగాని, వ్యవసాయ కార్యాలయంలోగాని దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన రైతులు సంబంధిత కంపెనీలకు రాయితీ పోను మిగతా డబ్బులకు చెల్లించాల్సి ఉంటుంది.

అందించే యంత్ర పరికరాలు..

బ్యాటరీతో, చేతితో నడిచే స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్, రోటోవేటర్, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ (ట్రాక్టర్‌తో నడిచే విత్తనాలు, ఎరువులు వేసే యంత్రం), కల్టివేటర్, ఎంబీ ప్లౌ కేజ్‌వీల్, రోటో పడ్లర్.

జిల్లాకు 428 యూనిట్లు..

వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు కోసం ప్రభుత్వం జిల్లాకు 428 యూనిట్లు కేటాయించిందని బిచ్కుంద ఏడీఏ ఇంద్రసేన్ తెలిపారు. ఆసక్తిగల మహిళా రైతులు దరఖాస్తు ఫారంతో పాటు ట్రాక్టర్‌కు సంబంధించిన ఆర్‌సీ పత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంకు పాసు బుక్, భూమి పట్టా పాస్‌బుక్ జతచేయాలని సూచించారు.

అక్రమ వడ్డీ వ్యాపారులపై కొరడా

కామారెడ్డి క్రైం: అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. బుధవారం జిల్లాలో ఏకకాలంలో 69 చోట్ల దాడులు చేసి 16 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు మోసపూరిత మాటలతో ప్రజల వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఆస్తులకు సంబంధించిన దస్తావేజులు తాకట్టు పెట్టుకుంటూ అధిక వడ్డీ రేట్లకు అప్పులు ఇస్తున్నారు. డబ్బులు తిరిగి చెల్లించలేని పరిస్థితులను తీసుకువస్తూ అమాయకుల ఆస్తులను జప్తు చేసుకుంటున్నారు. ఇలాంటి బాధలతో చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ విషయం పోలీసుల దృష్టికి రావడంతో బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దాడులు నిర్వహించామని ఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో 16 కేసులు నమోదు చేసి, విలువైన డాక్యుమెంట్‌లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కామారెడ్డి సబ్ డివిజన్ పరిధిలో 42 దాడులు చేసి 8 కేసులు నమోదు చేశామని, ఎల్లారెడ్డి పరిధిలో 12 దాడులు చేసి 5 కేసులు, బాన్సువాడ పరిధిలో 15 చోట్ల దాడులు చేసి 3 కేసులు పెట్టామని వివరించారు. చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జిల్లా కేంద్రంలోని ఓ ఫైనాన్స్ సంస్థలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

దుర్గమ్మ గుడి తండాలో ట్యాంకర్‌తో నీటి సరఫరా



ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మాచారెడ్డి : మైసమ్మ చెరువు తండా పంచాయతీ పరిధిలోని దుర్గమ్మగుడి తండాలో నెలకొన్న నీటి సమస్యపై 'నీటి కోసం తండ్లాడుతున్న తండా వాసులు' అన్న శీర్షికన ఈ నెల 21న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తండా వాసులకు ఉదయం, సాయంత్రం ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్నారు.

'సలాబత్‌పూర్ ఆలయానికి భారీగా నిధులు'



నూతన చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

మద్నూర్: సలాబత్‌పూర్‌లోని హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 70 కోట్లు మంజూరు చేసిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయిలు తెలిపారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్‌గా నియమితులైన రాంపటేల్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హన్మండ్లు స్వామి, విఠల్ గురూజీ, రవి, ప్రజ్ఞకుమార్, రమేశ్, అమూల్ తదితరులు పాల్గొన్నారు.

లారెక్కిన రైలు



భిక్కనూరు: పట్టాలపై వెళ్లాల్సిన రైలు.. లారీ ఎక్కింది. దీనిని చూసి రహదారిపై వెళ్తున్నవారు ఆశ్చర్యపోయారు. బుధవారం 44వ నంబర్ జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు నుంచి నాగ్‌పూర్ వైపు భారీ లారీలో రైలు ఇంజిన్‌ను తరలించారు. భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. రైలు బోగీలను తీసుకెళ్తున్న లారీకి 96 టైర్లున్నాయి.

ఇందిరమ్మ ఇళ్లకు మార్క్‌అవుట్ ఇవ్వండి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ఇళ్ల నిర్మాణాలపై మండలాల వారీగా సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: అర్హులైన నిరుపేద లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్క్‌అవుట్ ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, విద్యుత్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలకు మంజూరు ఉత్తర్వులు జారీచేశామన్నారు. నిర్మాణాలకు సిద్ధంగా ఉన్న లబ్ధిదారులకు మార్క్ అవుట్ ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలన్నారు. బేస్‌మెంట్ వరకు ఇంటి నిర్మాణాలు జరిగిన వాటి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందిరమ్మ డేమో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలపై మండలాల వారీగా సమీక్షించారు. రెండు పడక గదుల నిర్మాణాల కాలనీల్లో నీరు, విద్యుత్ సరఫరా లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో చందర్, హౌసింగ్ పీడీ విజయపాల్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, డీఆర్‌డీవో సురేందర్, పంచాయతీ రాజ్ ఈఈ లు దుర్గా ప్రసాద్, ఆంజనేయులు, మిషన్ భగీరథ ఇంజనీర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

టీజీవో డైరీ ఆవిష్కరణ

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీజీవో) డైరీని బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తో పాటు అడిషనల్ కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్‌లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీజీవో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.దేవేందర్, కార్యదర్శి బి.సాయిరెడ్డి, జిల్లా సమన్వయకర్త, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

కామారెడ్డి టౌన్ : మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవునిపల్లి కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు తరగతి గదులను, చీఫ్ సూపరింటెండెంట్ గదులను పరిశీలించారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు అధికారులతో మాట్లాడుతూ, పరీక్ష సమయానికి ముందే విద్యార్థులను నిశిత పరిశీలన చేసి కేంద్రం లోనికి పంపించాలని, మాల్ ప్రాక్టీస్ కు పాల్పడకుండా పరిశీలించాలని తెలిపారు. కేంద్రంలో తాగునీరు, టాయిలెట్స్, మెడికల్ సదుపాయాలు, రవాణా వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ వెంకటరమణ, డిపార్టుమెంటు అధికారిని మేరీ వర్ధనం, కామారెడ్డి తహసీల్దార్ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

26 మంది విద్యార్థుల గైర్హాజరు

జిల్లాలో బుధవారం 64 పరీక్ష కేంద్రాలలో జరిగిన గణిత శాస్త్ర పరీక్షకు 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 12,579 మంది విద్యార్థులకు గాను 12,553 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను డీఈవో ఎస్.రాజు పర్యవేక్షించారు.

క్యాసంపల్లి పల్లె దవాఖానాకు ఎన్‌క్వాస్ అవార్డు



క్యాసంపల్లి పల్లె దవాఖానా ముందు వైద్యులు, సిబ్బంది

కామారెడ్డి టౌన్: మండలంలోని క్యాసంపల్లి పల్లె దవాఖానాకు ఎన్‌క్వాస్ కింద నాణ్యత సర్టిఫికేట్‌తో పాటు ఉత్తమ అవార్డు దక్కింది. నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ సెంటర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌క్వాస్ బృందం ఆస్పత్రుల నిర్వహణపై తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 8 ప్రభుత్వ పల్లెదవాఖానాలకు ఎన్‌క్వాస్ నాణ్యత సర్టిఫికేట్‌లతో పాటు ఉత్తమ అవార్డులు అందించారు. ఇందులో క్యాసంపల్లి పల్లె దవాఖానాకు 88.05 మార్కులతో అవార్డు దక్కించుకుంది. ఈమేరకు వైద్యులు, సిబ్బందిని జిల్లా అధికారులు బుధవారం అభినందించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి



కామారెడ్డి టౌన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి(డీసీపీవో) స్రవంతి కోరారు. సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రోటరీ ఆడిటోరియంలో వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల బాలికల అక్రమ రవాణా, బాలికలపై జరుగుతున్న హింసను అడ్డుకోవాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియ పిలుపునిచ్చారు. అనంతరం డీసీపీవోను సన్మానించారు. సాధన స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మురళీమోహన్, ప్రతినిధులు వెంకటేశ్, రాజేందర్, సౌజన్య, గిరిజ, అనూష, మమత తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఆస్మాఅఫ్షిన్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వడదెబ్బ తగుల కుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మాఅఫ్షిన్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పదిలో జోరుగా మాస్ కాపీయింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు అడ్లూర్ ఎల్లారెడ్డి, కల్వరాల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన టెన్త్ పరీక్ష కేంద్రాల్లో జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి. పరీక్షా పత్రాన్ని బయటకు తీసుకొచ్చి ప్రశ్నలకు సంబంధించిన జవాబులను గదుల్లోకి పంపిస్తున్నారు. చిటీలను నేరుగా అటెండర్‌ల ద్వారా ఇన్విజిలేటర్‌లకు అందజేస్తున్నారని ప్రతిభ గల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సోదర భావంతో మెలగాలి



కలెక్టరేట్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్‌లు

కామారెడ్డి క్రైం: కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కామారెడ్డి కలెక్టరేట్‌లో ముస్లిం ఉద్యోగులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగులతో కలిసి పండ్లు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఆనందంగా పండుగలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్‌లు విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఏవో మసూర్ అహ్మద్, ఉద్యోగులు, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ప్రతినిధులు చక్రధర్, దేవరాజు, సాయిలు, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఇఫ్తార్ విందు

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం, ఇబ్రాహీంపేట్ గ్రామాల్లో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. బోర్లం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మన్నె అనిల్, మమ్మాయి లక్ష్మణ్, సాయిలు తదితరులు ఇఫ్తార్ విందు ఇవ్వగా, ఇబ్రాహింపేట్ గ్రామంలో మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, ఎంపీటీసీ కళావతి హన్మాండ్లు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు.

వందశాతం ఫలితాల కోసం కృషి చేయాలి



కలెక్టర్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిలను సన్మానిస్తున్న లెక్చరర్లు

కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు టీజీఎస్పీ ద్వారా నూతనంగా నియమితులైన లెక్చరర్లు బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాంను లెక్చరర్లు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ కళాశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత శాతం ఫలితాలు వచ్చేలా అధ్యాపకులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈఏపీఎస్ఈటీ, నీట్ లో కోచింగ్ ఇవ్వాలని, పోటీ పరీక్షల్లో విజయం సాధించే విధంగా కృషి చేయాలని తెలిపారు.

దుఃఖాన్ని దిగమింగుకొని.. పరీక్షకు హాజరై



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థి కీర్తన

భిక్కనూరు: కన్న తండ్రి అకాల మరణం ఒకవైపు, ఇన్నాళ్లూ కష్టపడి చదివి ఉన్నత చదువులకు ఓ మెట్టు ఎక్కే కీలకమైన ఎస్సెస్సీ పరీక్ష మరోవైపు. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్షకు హాజరైంది ఓ విద్యార్థిని. మండల కేంద్రానికి చెందిన బీబీపేట సత్యం బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన పెద్ద కూతురు కీర్తన జంగంపల్లి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తండ్రి మరణ విషయాన్ని బంధువులు కీర్తనకు చేరవేయగా బోరున విలపించింది. అదే దుఃఖంతో కీర్తన పరీక్షకు హాజరైంది. అనంతరం ఆమె మేనమామ వెంట బెట్టుకొని సత్యం అంత్యక్రియలు జరిగే మెదక్ జిల్లా నస్కల్‌కు తీసుకెళ్లాడు. సత్యం ముగ్గురు కుమార్తెలు, ఆయన భార్య రోదనలు మిన్నంటాయి.

ఫైనాన్షియర్ల ఇళ్లలో సోదాలు



లింగంపేటలో సోదాలు చేస్తున్న ఎస్సై ప్రకాష్

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రంలోని ఫైనాన్స్ నిర్వాహకుల ఇళ్లలో సోదాలు చేసినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలో గతేడాది ముగ్గురు ఫైనాన్షియర్ల కార్యాలయాలు, ఇళ్లలో సోదాలు చేసినట్లు సీఐ గుర్తు చేశారు. ఎస్పీ రాజేశ్ చంద్ర ఆదేశాలతో బుధవారం దాడులు చేశామన్నారు. గతంలో కేసులు నమోదైన పారిపల్లి సంతోష్, కౌడ రవి, జక్కని బాబాలతోపాటు కొత్త సంతోష్ దుకాణంలో సోదాలు నిర్వహించామన్నారు. పాత వారి వద్ద ఎలాంటి పత్రాలు, మనీ లెండింగ్ చేస్తున్నట్లు ఆధారాలు లభించలేదని తెలిపారు. కొత్త సంతోష్ వద్ద నాలుగు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఎక్కువ వడ్డీకి ఇచ్చినట్లు రాసుకున్న పత్రాలు, రిజిస్టర్లు, రూ. 90 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొత్త సంతోష్‌పై తెలంగాణ మనీ లెండర్స్ యాక్టు 1349 కింద కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు సీజ్ చేసి కలెక్టర్‌కు పంపుతామని పేర్కొన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎస్సై ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డిలో తనిఖీ చేస్తున్న ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలో వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న పలువురి ఇళ్లలో ప్రత్యేక పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై మహేశ్ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని శేఖరప్ప, జాడె సూర్య ప్రకాశ్, పంతంగి శ్రీనివాస్, మండలంలోని హాజీపూర్ తండాకు చెందిన లునావత్ లాలు ఇంట్లో తనిఖీ చేసి ప్రామిసరీ నోట్లు, చెక్కులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

అనుమతిలేని ఫైనాన్స్ నిర్వాహకుల ఇళ్లపై దాడి

భిక్కనూరు: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా ఫైనాన్స్‌లు, చీటీలు నడిపే వారి ఇళ్లపై సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న వారి ఇళ్లతోపాటు వ్యాపార సముదాయాలపై దాడులు చేసి ప్రామిసరీ నోట్‌లు, పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్ మీటర్‌లో నాగు పాము



ఎల్లారెడ్డిరూరల్: విద్యుత్ మీటర్‌లోకి చేరిన నాగుపాము ఎల్లారెడ్డి పట్టణంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. సాయిబాబా వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో బుధవారం ఉదయం నిర్వాహకులు మోటార్ ఆన్ చేసే క్రమంలో మీటర్‌లో నుంచి బుసలు కొడుతున్న శబ్దం రాగా, లోపల గమనించగా నాగు పాము కనిపించింది. చుట్టుపక్కల వారు వచ్చి మీటర్ డోర్ తెరిచే సరికి పాము అక్కడి నుంచి జారుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పోక్సో కేసులో నిందితుడి రిమాండ్

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు కన్నెబోయిన వేణు ప్రేమిస్తున్నానని నమ్మించి బలవంతంగా శారీరకంగా కలిసినట్లు తెలిపారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం పేకాట స్థావరంపై దాడి చేసి పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. స్థానిక గాంధారి-బాల్‌రాజు గుడి సమీపంలోని ఖాళీ స్థలంలో పేకాడుతున్నారనే పక్కా సమాచారంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద రూ.7,910 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

మోర్తాడ్: భీమ్‌గల్‌లోని కప్పలవాగు నుంచి రాత్రిపూట అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రైం కార్నర్

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బొలెరో

- కూతురు మృతి, తండ్రికి తీవ్రగాయాలు



విజయలక్ష్మి (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): నాందేడ్ - సంగారెడ్డి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పిట్లం మండలం కంభాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప సత్యవ్వ-సాయిలు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. సాయిలు కంభాపూర్ జీపీలో ఫిట్టర్‌మన్‌గా పనిచేస్తున్నాడు. పెద్ద కూతురు విజయలక్ష్మి(12) సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గం బీసీ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. సాయిలు బైక్‌పై అల్లాదుర్గానికి వెళ్లి.. కూతురుని తీసుకొని కంభాపూర్‌కు వస్తున్నాడు. నిజాంసాగర్ మండలం మంగ్లూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై బొలెరో వాహనం రాంగ్ రూట్‌లో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో తండ్రీకూతుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిస్తుండగా విజయలక్ష్మి మృతి చెందింది. సాయిలు చికిత్స పొందుతున్నాడు. నిజాంసాగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



కంపె ఆశయ్య (ఫైల్)

లింగంపేట/ఎల్లారెడ్డిరూరల్ : మండలంలోని మాలపాటి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కంపె ఆశయ్య(46) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆశయ్య మంగళవారం సాయంత్రం ఎల్లారెడ్డి నుంచి బైక్‌పై స్వగ్రామం మాలపాటికి వస్తుండగా శివ్వాపూర్ సమీపంలో ఎదురుగా సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో ఎల్లారెడ్డికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ జీజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- ఒకరి మృతి

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మంగ్లూర్ గేటు వద్ద సంగారెడ్డి- నాందేడ్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ ప్రాంతానికి చెందిన వ్యక్తి అని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై శివకుమార్ తెలిపారు.

ఆటో, బైక్ ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రామారెడ్డి రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చర్చి ప్రాంతంలో ప్రధాన రహదారిపై ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న రామారెడ్డికి చెందిన ఎర్రోళ్ల రాజు, గోదలకాడ శ్రీనుకు తీవ్రగాయాలు కాగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వద్ద లభించిన నగదు రూ.4,800లను ఏరియా ఆస్పత్రి కానిస్టేబుల్ లక్ష్మణ్ వారి కుటుంబసభ్యులకు అప్పగించారు.

కానిస్టేబుల్, హోంగార్డుల సస్పెన్షన్

కామారెడ్డి క్రైం: విధి నిర్వహణలో దురుసుగా ప్రవర్తించిన బాన్సువాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ఎస్.కిరణ్, హోంగార్డు ఎం గంగాధర్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ రాజేశ్ చంద్ర బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాన్సువాడలోని ఓ కల్లు దుకాణంలో గొల్ల శ్రీనివాస్ అనే వ్యక్తి న్యూసెన్స్ చేస్తున్నాడనే సమాచారం బ్లూకోల్ట్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్, హోంగార్డులు అక్కడకు వెళ్లారు. అక్కడ మద్యం సేవించి ఉన్న వ్యక్తి శ్రీనివాస్‌పై దురుసుగా ప్రవర్తించినందుకు ఇద్దరిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో ఏఆర్ కానిస్టేబుల్

భిక్కనూరు: మండలకేంద్రంలో ఈనెల 12వ తేదీన మద్యం మత్తులో వీరంగం సృష్టించిన ఏఆర్ కానిస్టేబుల్ సంతోష్‌గౌడ్‌ను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆస్తితగాదాల విషయమై సంతోష్‌గౌడ్ తన సోదరుడు వేణుతో పాటు మరదలు నవ్యలతో ఘర్షణపడ్డ విషయం తెలిసిందే. ఈ విషయమై నవ్య భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యక్తి అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ధర్మశాల ప్రాంతానికి చెందిన మహమ్మద్ యూసుఫ్(45) అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి బుధవారం తెలిపారు. యూసుఫ్ పెయింటర్‌గా పని చేసేవాడని, ఈ నెల 23న ఇంటి నుంచి బయటికి వెళ్లి, తిరిగి రాలేదని పేర్కొన్నారు. భార్య సాఫియా బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మృతి

నవీపేట: మండలంలోని మిట్టాపూర్‌కు చెందిన మేకల లస్మన్న(49) చేపలు పట్టేందుకు వెళ్లి మృతి చెందినట్లు ఎస్సై వినయ్ బుధవారం తెలిపారు. మంగళవారం గోదావరిలో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. బుధవారం ఉదయం గోదావరిలో లస్మన్న మృతదేహం తేలింది. భార్య పోసాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యాక్సిడెంట్ కేసులో ఇద్దరికి జైలు

- తుపాన్ డ్రైవర్‌కు మూడేళ్లు... ఆటో డ్రైవర్‌కు మూడు నెలలు

రుద్రూర్: పదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ బుధవారం బోధన్ కోర్టు న్యాయమూర్తి శివసాయి తీర్పు వెలువరించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2014 అక్టోబర్ 3న అక్బర్‌నగర్ శివారులో ఆటోను తుపాన్ వాహనం ఢీకొన్న ఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురు మహిళలు, ఒక పాప మరణించారు. ఈ దుర్ఘటనపై అప్పటి వర్ని ఎస్సై సుఖేందర్ రెడ్డి కేసు నమోదు చేయగా సీఐ దామోదర్ రెడ్డి.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధన్‌గావ్ పంకజ్‌నగర్ వాసీకి చెందిన తుపాన్ డ్రైవర్ బల్కి శివాజీ బలరాం, కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ మజీద్‌పై చార్జిషీట్ దాఖలు చేశారు. పదేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం బుధవారం న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి నలుగురి మృతికి కారణమైన తుపాన్ డ్రైవర్‌కు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.3 వేల జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లిన ఆటో డ్రైవర్‌కు మూడు నెలల కఠిన కారాగార శిక్ష, రూ.500ల జరిమానా విధించడంతోపాటు ఆరు నెలలపాటు లైసెన్స్ రద్దు చేశారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి వాదనలు వినిపించారని ఎస్సై తెలిపారు.

మహిళ మృతికి కారణమైన నిందితులకు మూడేళ్లు..

కామారెడ్డి క్రైం: ఓ వివాహిత మరణానికి కారణమైన ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూర్ మండలం పెద్ద మల్లారెడ్డికి చెందిన బొజ్జ దివ్య అనే వివాహితను ఆమె చిన్న మామ బాలయ్య, సింగిలి వంశీలు వేధించేవారు. మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకున్నావని తరచూ మాటలు అనడం, వేధింపులకు గురిచేయడంతో 2023 జూలై 10న దివ్య ఇంటి వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది. బాలయ్య, వంశీ కారణంగానే తన చెల్లెలు చనిపోయినట్లు దివ్య సోదరుడు పరశురాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరిపి నిందితులను రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో మహిళ మృతికి కారణమైన నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి సుమలత తీర్పు ఇచ్చారు. శిక్షపడేలా సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టిన సీఐలు తిరుపయ్య, సంపత్ కుమార్, ఎస్సైలు ఆనంద్ గౌడ్, మురళి, పీపీ రాజగోపాల్ గౌడ్, పోలీసు సిబ్బంది ప్రమోద్ రెడ్డి, రాజశేఖర్ గౌడ్‌ను ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

దురుసుగా ప్రవర్తించిన ఏడుగురికి..

బోధన్: పోలీసులపట్ల దురుసుగా ప్రవర్తించి, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి రోడ్డుపై ధర్నా చేయడంతో పాటు ఓటర్లను ఆటంకపర్చిన కేసులో ఏడుగురికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం బోధన్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎం. పూజిత తీర్పు వెలువరించారు. జైలు శిక్ష పడిన వారిలో బోధన్, సాలూర మండల కేంద్రానికి చెందిన వ్యక్తులున్నారని బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు.